మహిళల ఆత్మకథలు, జీవిత చరిత్రలు–సమాలోచన

రెండురోజుల అంతర్జాతీయ సదస్సు– వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం

సదస్సు  నివేదిక

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, రూసా, తెలంగాణ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో “మహిళల ఆత్మకథలు, జీవిత చరిత్రలు–సమాలోచనం” శీర్షికన రెండురోజుల అంతర్జాతీయ సదస్సు తేది: జనవరి 07,08.2026 రెండు రోజులలో ఎంతో వైభవంగా జరిగింది. విశ్వవిద్యాలయం ప్రగతి సారథి, క్రాంతాదర్శి, చైతన్య దీప్తి, స్ఫూర్తి ప్రదాత, విద్యాలయ అభివృద్ధే శ్వాసగా భావించే తొలి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యాధనంజయ్ గారి మార్గ నిర్దేశనంలో, మహిళా కళాశాల ప్రిన్స్ పాల్ గారి సలహాలు, సూచనలతో, తెలుగుశాఖ, మహిళా కళాశాల అపూర్వ అధ్యక్షులు, ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎస్. రఘు గారి పర్యవేక్షణలో ఈ రెండురోజుల సదస్సు విజయవంతంగా కొనసాగింది.

ఈ అంతర్జాతీయ సదస్సులో  నలభై రెండు మంది మహిళల విజయ గాథలను, కనీటి వ్యతలను, స్ఫూర్తిదాయకమైన ప్రయాణాలను, కంటికి కనిపించని అఖాతలను, వారు చేసిన పోరాటాలను, సాహసాలను, ఎదుర్కొన్న వివక్షతలను, ఎదిరించిన సంఘటనలను ఈ సదస్సు మాధ్యమంగా ప్రపంచం ముందు ఉంచడం జరిగింది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా వున్న వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు తమ అమూల్యమైన పత్రసమర్పణ చేశారు.

తేది: 07.01.2026 నాడు ఉదయం పదిగంటలకు ప్రారంభ సమావేశం అంగరంగ వైభవంగా ఆరంభమైంది. ఈ సమావేశానికి మహిళా కళాశాల ప్రిన్స్ పాల్  లోకపావని స్వాగతం పలుకగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్ గారు

అధ్యక్షత వహించగా డా. యోగితారాణా ఐ.ఎ.ఎస్. (ప్రిన్స్ పాల్ సెక్రటరీ విద్యాశాఖ తెలంగాణ రాష్ట్రం), తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ జి. బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా, శ్రీమతి ఎ. దేవసేన కమిషనర్ కళాశాల విద్యాశాఖ విశిష్ట అతిథిగా విచ్చేశారు. ఈ సదస్సునుద్దేశించి ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే(కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు గ్రహీత, ప్రముఖ విమర్శకులు) కీలకోపన్యాసం చేశారు. ఆత్మీయ అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ పాల్గొన్నారు. సభాధ్యక్షులు ప్రొఫెసర్ సూర్యాధనంజయ్ గారు ప్రారంభ పలుకులు పలుకుతూ పిడికిలి బిగించి సాయుధ రైతాంగ పోరాట పతాకాన్ని ఎత్తిన చాకలి ఐలమ్మ స్ఫూర్తి ఈ సదస్సుకు భూమిక అన్నారు. పదమూడేండ్ల అమ్మాయి మాలావత్ పూర్ణ సంకల్పానికి ఎవరెస్ట్ శిఖరమే లొంగినపుడు, కఠోర శ్రమను ఆయుధంగా చేసుకున్నప్పుడు ఎవరైనా విజయ తీరాలకు చేరుకుంటారని విద్యార్థినులలో ప్రేరణను నింపారు.

ముఖ్య అతిథి గౌరవనీయులు డా. యోగితా రాణా ఐ.ఎ.ఎస్ గారు మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ప్రగతి పథంలో సాగుతూ సమాజానికి మహిళా సాధికారతను సాధించే దిశగా ఈ సదస్సును నిర్వహించడం పట్ల ఎంతో గర్వంగా ఉందన్నారు. రేపటి భవిష్యత్తు మహిళదేనని అందుకు మహిళల ఆత్మకథలు మార్గాన్ని చూపుతాయని అన్నారు. మరొక ముఖ్య అతిథి ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి గారు ప్రసంగిస్తూ "మానవీయ విలువలు సన్నగిల్లి మొబైల్ లలో బంధించబడిన మనకు మహిళల ఆత్మకథలు, జీవితచరిత్రలు మేలుకొలుపులు" అన్నారు. ఈ సదస్సు నుంచి ప్రేరణ పొంది సముద్ర అంతర్భాగం నుండి ఆకాశపు అంచుల దాకా ఉన్న అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. విశిష్ట అతిథి శ్రీమతి ఎ. దేవసేన ఐ.ఎ.ఎస్. గారు మాట్లాడుతూ మహిళలు రానించలేని రంగమంటూ ఏదిలేదని వారు తలచుకుంటే సాధించలేనిది ఉండదని అభిప్రాయ పడ్డారు. కీలకోపన్యాస కర్త ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే గారు మాట్లాడుతూ స్త్రీల గొంతుకలను శక్తిమంతంగా వినిపించడానికి కథ, నవల ప్రక్రియలకంటే స్వీయచరిత్రలో ఆత్మావలోకనం చేసుకోవడానికి, తమ వేదనను చెప్పుకోవడానికి ఎక్కువ అవకాశ ముంటుందని,

తెలుగులో స్వీయరచన యాత్రారచనతో ప్రారంభమైందని అన్నారు. స్వీయచరిత్రలలోని రకాలను పేర్కొన్నారు. ఆత్మీయ అతిథి ఆచార్య కమలాకరశర్మ గారు మాట్లాడుతూ జీవితచరిత్రకంటే ఆత్మకథ బలమైనదని అన్నారు. మనిషిని మనీషిగా తీర్చిదిద్దేది ఒక్క సాహిత్యమేనన్నారు. మహిళా కళాశాల ప్రిన్స్ పాల్ డా.లోకపావని గారు మాట్లాడుతూ మహిళాలోకం ఎదుర్కొంటున్న సవాళ్ళను అధిగమించడమే ధ్యేయంగా ఈ సదస్సు ముదుకు సాగుతుందని అన్నారు. సదస్సు లక్ష్యాన్ని తెలుగు శాఖాధ్యక్షులు డా. ఎం. దేవేంద్ర సభముందుంచారు. తల్లి తన పిల్లలకు పాలతోపాటు లోకంలోని సహాసాలను, పోరాట గాథలను నూరిపోసినట్లు ఈ సదస్సు మహిళల గాథలను నూరిపోయడం ద్వారా విద్యార్థుల జీవితాలలో స్ఫూర్తినింపే ప్రయత్నం చేస్తుందన్నారు.

మొదటి సాంకేతిక సమావేశం తెలంగాణా యునివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ కరిమిండ్ల లావణ్య గారి అధ్యక్షతన జరిగింది. వారు హేమలతా లవణం గారి ఆత్మకథ 'ఇది నాజీవితం' అనే అంశంమీద పత్ర సమర్పణ చేశారు. ఈ సమావేశంలో గోగుశ్యామల నేనే బలాన్ని (టి.ఎన్. సదాలక్ష్మి ఆత్మకథ), అపర్ణతోట 'ఒక హిజ్రా ఆత్మకథ'(రేవతి), ప్రొఫెసర్ జి.వి.రత్నాకర్ 'రమాబాయి అంబేడ్కర్ జీవిత చరిత్ర', ప్రొఫెసర్ జె. వెంకటరమణ 'నాలోనేను'(భానుమతి రామకృష్ణ ఆత్మకథ), డా. సంగిశెట్టి శ్రీనివాస్ సావిత్రిబాయి పూలే జీవితచరిత్ర, డా. అజ్మీరా సుజాత 'మాలావత్ పూర్ణ జీవితచరిత్ర' రాపోలు సీతారామారావు (దక్షిణాఫ్రికా) 'విన్ని మండేలా ఆత్మకథ' మీద తమ విలువైన పత్రాలను సమర్పించారు.

భోజన విరామం తర్వాత రెండవ సాంకేతిక సదస్సు కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ప్రొఫెసర్ వి. త్రివేణి గారి అధ్యక్షతన జరిగింది. వారు ముదిగంటి సుజాతారెడ్డి ఆత్మకథ 'ముసురు' పై పత్ర సమర్పణ చేశారు. ఇదే సమావేశంలో దాసరి అమరేంద్ర 'వెలుగుదారులలో' (నంబూరి పరిపూర్ణ ఆత్మకథ), డా. జె. నీరజ 'నేను పూలన్ దేవిని'( పూలన్ దేవి ఆత్మకథ), డా. ఎన్. సంధ్యారాణి చదువు

తీర్చిన జీవితం ( కాళ్ళకూరి శేషమ్మ ఆత్మకథ) డా. కాంచనపల్లి గోవర్ధనరాజు (ఆస్ట్రేలియా) 'హెలెన్ కెల్లర్ జీవితచరిత్ర' మీద వీడియో ప్రసంగం చేశారు.

తేది: 08.01.2026 రోజు ఉదయం 9:30 గంటలకు మూడవ సాంకేతిక సామవేశం డా. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటి తెలుగుశాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ రజని గారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డా. ఏలె విజయలక్ష్మి 'సాహితీ రుద్రమ'( ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ), గార్లపాటి పల్లవి 'మహానటి సావిత్రి'జీవిత చరిత్ర, సి.వనజ 'పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా', అట్టెం దత్తయ్య 'ఐనా నేనోడిపోలేదు', నస్రీన్ ఖాన్ 'నేను మాలాల', మానస ఎండ్లూరి 'ఒక సెక్స్ వర్కర్ ఆత్మకథ', డా. కె.డి.డి. మృణాళిని 'నాబాల్యం నేను ఎదిగిన వైనం', డా. కొండపల్లి నిహారిణి (అమెరికా) 'ఇంద్రా నూయి ఆత్మకథ' అనే అంశాల మీద పత్ర ప్రసంగం చేశారు.

నాలుగవ సాంకేతిక సదస్సు డిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గంపా వెంకట్రామయ్య గారి అధ్యక్షతన జరగింది. ఆయన 'నిర్జన వారధి'(కొండపల్లి కోటేశ్వరమ్మ)అనే అంశం మీద ప్రసంగించారు. ఈ సమావేశంలో ప్రొ. రాజేశ్వరమ్మ 'నేమరేసిన మెమరీస్',జూపాక సుభద్ర 'చిందుల ఎల్లమ్మ', స్వర్ణకిలారి 'విద్యాసుందరి బెంగళూరు నాగారత్నమ్మ జీవితచరిత్ర', డా. యువశ్రీ 'బీనాదేవీయం', డి. జ్వలిత 'చాకలి ఐలమ్మ',డా.బి.మనోహరి 'నీరా ఆర్యా',రెంటాల కల్పన (అమెరికా) 'మాతంగి దివిటి' అనే అంశాల మీద తమ విలువైన పత్రాలను సమర్పించారు.

ఐదవ సాంకేతిక సదస్సు కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ప్రొఫెసర్ పి. వారిజారాణి అధ్యక్షతన జరిగింది. వారు సుస్వరాల సుబ్బులక్ష్మి (ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవితచరిత్ర) అనే అంశంపై ప్రసంగించారు. ఈ సాకేంతిక సమావేశంలో ప్రొ.కిన్నెర శ్రీదేవి 'శ్రీ శ్రీ సంసార ప్రస్థానం'(సరోజా శ్రీశ్రీ ఆత్మకథ), ప్రొ. ఎన్. ఈశ్వర్ రెడ్డి 'ఆనందీబాయి జోషి జీవితచరిత్ర',అయినంపూడి శ్రీలక్ష్మి 'మల్లవరపు ఇన్యాసమ్మ జీవితచరిత్ర', పి. జ్యోతి 'కనకపుష్యరాగం', డా. టి. శ్రీవల్లి రాధిక 'భారతదేశంలో నా జైలు జీవితం', డా.షమీ ఉల్లా 'చక్రాల కుర్చి', డా. ఎల్. సుజాత 'గోరాతో నాజీవితం', డా. నందిగామ

నిర్మలాకుమారి 'ఈశ్వరీబాయి జీవితచరిత్ర', కుందుర్తి కవిత (సింగపూర్) 'సంచారి బుర్రకథ ఈరమ్మ' అనే అంశం మీద తమ అమూల్యమైన ప్రతసమర్పణలు చేశారు.

ముగింపు సమావేశం తేది: 08.01.2026 మధ్యాహ్నం 3:45 నిమిషాలకు ఆరంభమైంది. ఈ సమావేశానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సూర్యా ధనంజయ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సమపనోపన్యాస కర్తగా సాహిత్య అకాడెమి తెలుగు విభాగం కన్వీనర్ ప్రొఫెసర్ సి. మృణాళిని, విశిష్ట అతిథులుగా ప్రముఖ రచయిత్రి డా. ముదిగంటి సుజాతారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్స్ పాల్ ప్రొఫెసర్ సి. కాశీం, హాజరవ్వగా తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. గడ్డం మోహన్ రావ్ సదస్సు నివేదిక వినిపించారు.

ముగింపు సమావేశంనుద్దేశించి ఉపకులపతి ఆచార్య సూర్యాధనంజయ్ మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళాభ్యుదయం, స్త్రీ చైత్తన్యం దిశగా ఈ సదస్సు ఒక ముందడుగు వేసిందని, సాహిత్యం వేదికగా రానున్న సదస్సులకు భూమికగా నిలిచిందన్నారు. ముఖ్య అతిథి ఆచార్య వెలుదండ నిత్యానందరావు సందేశమిస్తూ ఆత్మకథలు, జీవితచరిత్రలు రేపటి పౌరులకు కొత్తదారిని చూపి సవాళ్ళను ఎదుర్కొనడంలో సహాయకారిగా నిలుస్తాయన్నారు. సమాపనోపన్యాసకర్త ప్రొఫెసర్ మృణాళిని మాట్లాడుతూ ఎన్నడూ స్త్రీల ఆత్మకథల మీద అంతర్జాతీయ సెమినార్ జరగలేదని ఇది ఒక కొత్తబాటను చూపే సదస్సు అని కొనియాడారు. జీవితచరిత్రలు వ్యక్తుల జీవితాలపై చూపే ప్రభావాన్ని వివరించారు. విశిష్ట అతిథులలో ఒకరైన డా. ముదిగంటి సుజాతారెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థినిలను జీవితచరిత్రలు రాసేవిధంగా ప్రోత్సహిస్తుందని అన్నారు. మరొకరు ఆచార్య. సి. కాశీం మాట్లాడుతూ మహిళలు సమాజ నిర్మాతలుగా ఆదినుండి ముందున్నారని వారి జీవిత పాఠాలను ఈ సదస్సు లోకానికి అందించిందని అన్నారు. ఎంతో వైభవంగా సాగిన ఈ సదస్సులో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, సాహితీ

అభిమానులు, పి.జి., డిగ్రీ విద్యార్థినులు, వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొన్నారు.